# వి(దేశీ)చిత్రాలు

ఈసారి వ్రాస్తున్నది విదేశీ చిత్రాల గురించి కాదు. దేశీ చిత్రాల గురించీ కాదు. విచిత్రమేమిటంటే విదేశాల్లో ఎంతో మంది భారతీయులు ఎంతో చక్కటి సినిమాలు తీస్తున్నారు. సినిమాల్లో నటిస్తున్నారు. వాళ్ళల్లో చాలమంది గురించి ఇండియాలో కొంతమందికి తెలిస్తే, మరి కొంతమంది గురించి తెలుసని నేను అనుకోను. ఎందుకంటే అవి ఇండియన్ మార్కెట్ కోసం తీసినవి కాదు కనుక.

మనవాళ్ళు మన కోసం తీసిన సినిమాలు బయట ప్రపంచంలో రిలీజ్ అయినా వాటి గురించి వ్రాయటం లేదు. ఎందుకంటే వాటి సంగతి మీకందరికీ తెలుసు. విదేశీయులు ఇండియా నేపథ్యంలో తీసినవీ, భారతీయులూ, విదేశీ భారతీయులూ అంతర్జాతీయ మార్కెట్ కోసం తీసినవీ, వాటిల్లో నటించిన మనవాళ్ళ గురించీ వ్రాస్తున్నాను.

కొన్ని దశాబ్దాల క్రితమే, బ్రిటిష్ రాజ్యంలో ఇండియా మీద చాల సినిమాలు వచ్చాయి. రుడ్‌యార్డ్ కిప్లింగ్ ఈ బ్రిటిష్ రాజ్ మీద చాల పుస్తకాలు వ్రాశాడు. దాదాపు అవన్నీ సినిమాలుగానే వచ్చాయి. 1939లో కారీ గ్రాంట్ నటించిన గంగాదిన్, 1950లో వచ్చిన కిమ్, 1975లో వచ్చిన ది మాన్ హూ వుడ్ బి కింగ్, తర్వాత మామూలుగానూ కార్టూన్‌గానూ ఎన్నోసార్లు సినిమాగా వచ్చిన 'జంగిల్ బుక్' అన్నీ ఆయన వ్రాసినవే. పాల్ స్కాట్ అనే ఆయనకి బుక్కర్ ప్రైజ్ తెచ్చిన నవల 'స్టేయింగ్ ఆన్' 1979లో చలనచిత్రంగా వచ్చింది. 1982లో జామ్స్ ఐవరీ, ఇస్మాయిల్ మర్చంట్‌ల హీట్ అండ్ డస్ట్ అనే సినిమా వచ్చింది. వీరిద్దరి గురించీ మళ్ళీ చెబుతాను. ఈ బ్రిటిష్ రాజ్ సినిమాల్లో ఆనాటి నటుడు ఐ.ఎస్.జోహార్ కొన్నిటిలో నటించాడు కూడాను.

1982లో వచ్చిన రిచర్డ్ అట్టెన్బరో గాంధీ పెద్ద సంచలనం కలిగించింది. బ్రిటిష్‌వారి మీద జరిపిన స్వాతంత్ర సమరం మీద, ఒక బ్రిటిష్ దర్శకుడు తీశే సినిమా పక్షపాతంగా వుంటుందని భావించిన విమర్శకుల అంచనాలని తప్పని నిరూపించి అంతకుముందూ తర్వాతా గాంధీ మహాత్ముడిమీద వచ్చిన అన్ని సినిమాలకన్నా గొప్పగా అందర్నీ ఆశ్చర్యపరిచి, ఎన్నో ఆస్కారులు కూడా సంపాదించింది. బ్రిటిష్ నటుడు బెన్ కింగ్స్‌లీ మహాత్ముని మన కళ్ళముందు మళ్ళీ నిలబెట్టాడు. 1984లో వచ్చిన 'ది ఫార్ పెవిలియన్స్' ఇంకొక చక్కటి సినిమా. 1984లో 'జువెల్ ఇన్ ది క్రౌన్' అనే సినిమా అమెరికన్ టీవీలో పెద్ద హిట్టయింది. అప్పుడే వచ్చింది

డేవిడ్ లీన్ తీసిన 'పాసేజ్ టు ఇండియా' ఇ.ఎం.ఫోస్టర్ వ్రాసిన నవల ఆధారంగా తీసిన ఈ చిత్రంలో, అలెక్ గినిస్, విక్టర్ బెనర్జీ ఎంతో గొప్పగా నటించారు. నాకు బాగా నచ్చిన ఇంకొక సినిమా 1986లో వచ్చిన 'మౌంట్ బాటెన్ - లాస్ట్ వైస్రాయ్' అనేది. ఇయాన్ విలియంసన్ అనే నటుడు చాల గొప్పగా నటించాడందులో. గాంధీ సినిమాలో జిన్నాకి అన్యాయం జరిగిందని పాకిస్థానీలు కొంత గొడవపెట్టారు. ఆ నేపథ్యంలోనే 1998లో వచ్చింది జమీల్ డెహ్లవీ అనే ఒక పాకిస్థానీ ఆయన దర్శకత్వం చేసిన జిన్నా. ఇవీ నాకు గుర్తున్నంతవరకూ బ్రిటిష్ రాజ్ చిత్రాలు.

ఇందాక ఇస్మాయిల్ మర్చంట్ సినిమాల గురించి చెప్పుకున్నాం. ఆయన జేమ్స్ ఐవరీ అనే బ్రిటిష్ దర్శకుడితో కలిసి ఎన్నో గొప్ప చిత్రాలు నిర్మించాడు. యాభై సినిమాలకు పైన నిర్మాతగా, తొమ్మిది సినిమాలకి దర్శకుడిగా పనిచేశాడు. శశికపూర్‌తో షేక్స్‌పియర్‌వాలా మొదలైన చిత్రాలు నిర్మించాడు. శశికపూర్, సిమి నటించిన సిద్ధార్థ అనే సినిమా ఆ రోజుల్లో సిమి నగ్నంగా నటించిందని ఇండియాలో దుమారం లేపింది. హెర్మన్ హెస్సీ వ్రాసిన నవలకు, కానాడ్ రూక్స్ దర్శకత్వంలో నిర్మించిన సిద్ధార్థ చక్కటి సినిమా. సత్యం కోసం అన్వేషించే ఒక మనిషి కథ అది. ఈ రోజుల్లో కూడా అమెరికన్ టీవీలో ఎప్పుడూ వస్తూనే వుంటుంది.

మనకి పౌరాణిక సినిమాలు చూడటం అంటే ఇష్టం. ముఖ్యంగా ఎస్.వి.రంగారావ్, ఎన్.టి.రామారావ్ రకరకాల కిరీటాలతో దుస్తులతో ఆ సినిమాలకి వన్నె తెచ్చేవారు. పీటర్ బ్రూక్స్ అనే ఆయన చాల నిజాయితీ తో మహాభారతంని ఒక పౌరాణిక కథలా కాకుండా మానవాళి చరిత్రగా నిర్మించాడు. ఆరు గంటల సినిమా. ఏనాడో అటవీకుల కాలంలో జరిగిన కథ కనక అదే రకమైన వ్యక్తులుగా చూపిస్తూ నగలూ కిరీటాలూ లేకుండా పద్యాలూ పాటలూ లేకుండా చాలా కళాత్మకంగా తీసిన సినిమా అది. అది భారతమైనా మానవాళి కథ కనుక, తెల్లవాళ్ళనీ, నల్లవాళ్ళనీ, చైనా వాళ్ళనీ, మల్లికా సారాభాయ్‌లాటి భారతీయులనీ, అందరినీ కలిపి తీశాడా సినిమా. నాకు బాగా నచ్చింది. కానీ మనవాళ్ళకి చాలమందికి ఆ సినిమా నచ్చలేదు. కిరీటం లేని కృష్ణుడినీ, సన్నగా పొడుగ్గా నల్లగా వున్న భీష్ముడినీ కొంతమంది చూడలేకపోయారు. ఇవన్నీ గత పదిహేను ఇరవై ఏళ్ళక్రితం వచ్చిన సినిమాలు. తర్వాత ఈ వి(దేశీ)చిత్రాలు ఎలా వున్నాయో చూద్దాం.

ఈ నవతరంలో చెప్పుకోదగ్గ నిర్మాతలు దర్శకులు ముగ్గురు. మీరా నాయర్, శ్యామలన్, అశోక్ అమృతరాజ్. ఈ మధ్య ఎన్నారై కబుర్లలో నైట్ శ్యామలన్ గురించి చెప్పుకున్నాం. ఈయన సినిమాలలో కథాంశం ఇండియాకి సంభందించినది కాదు. సిక్స్త్ సెన్స్, అన్‌బ్రేకబుల్, సైన్స్, విలేజ్ మొదలైన సస్పెన్స్ సినిమాలతో ఒక్కసారిగా పెద్ద పేరు సంపాదించుకున్నాడు. పెన్సిల్వేనియాలో పెరిగిన ఈయన, అదే రాష్ట్రం వాతావరణంలో బ్రూస్ విల్లిస్, మెల్ గిబ్సన్, యోక్విన్ ఫీనిక్స్ మొదలైన పెద్ద తారాగణంతో తీశాడీ సినిమాలని. సినిమాల్లో కథలూ స్క్రీన్‌ప్లేలూ వ్రాసే ఈయన దర్శకుడిగా మారిపోయాడు. తన సినిమాలలో చిన్న చిన్న

వేషాలుకూడా వేశాడు. ఏ సినిమా తీసినా, ఎన్నో రకాల కథలని ఎంతో ధైర్యంగా సూటిగా తీయగల సమర్థురాలు మీరా నాయర్. ఈవిడ ముందు కొన్ని డాక్యుమెంటరీలు తీసిందిట. 1995లో అనుకుంటాను పెరెజ్ ఫామిలీ అని ఒక సినిమా చూశాను. మయామీలో ఒక క్యూబన్ ఫామిలీ జీవితం గురించి తీసిన ఒక మంచి సినిమా. ఆ సినిమా చూస్తున్నప్పుడే తెలిసింది అది మీరా నాయర్ చిత్రమని. నాకు నచ్చిన సినిమా. అంతకు ముందే ఈవిడ తీసిన రెండు సినిమాలు చూశాను. ఒకటి సలాం బాంబే. బాంబే మురికివాడల్లోని జీవితం మీద తీసినదది. ఆస్కార్ బహుమతులకి నామినేట్ చేయబడింది. రెండవది రెండవ తరం ఇండియా అమ్మాయి, నల్ల అమెరికన్ల మధ్య ప్రేమాయణం, మిస్సిసిప్పి మసాలా. కామసూత్ర, మాన్సూన్ వెడ్డింగ్, హిస్టీరికల్ బ్లైండ్‌నెస్, వానిటీ ఫెయిర్‌లాటివన్నీ ఆవిడకి పేరు తెచ్చాయి. ఆవిడ సినిమాల్లో రోషన్ సేత్, సరిత చౌదరి ఎక్కువగా కనిపిస్తుంటారు. టెన్నిస్ ఆడే అమృతరాజ్ సోదరుల్లో చివరివాడు అశోక్. కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెలెస్‌లో స్థిరపడిపోయి, ఇప్పటికి 27 సినిమాలకి పైగా నిర్మించాడు. ఈయన హాలీవుడ్‌లో చిన్న బడ్జెట్ సినిమాలతో మొదలుపెట్టి, తరవాత డస్టిన్ హాఫ్‌మన్, సూసాన్ సరండాన్, హాలీ హంటర్, కేట్ హడ్సన్, స్టీవ్ మార్టిన్‌లాటి పెద్ద తారా గణంతో సినిమాలు నిర్మించాడు.

తరువాత చెప్పుకోదగ్గ వారిలో ముఖ్యులు కెనడాలో పుట్టి అమెరికాలో నివసిస్తున్న నిషా గణత్రా, ఇండియాలో పుట్టి కెనడాలో నివసిస్తున్న దీపా మెహతా. నిషా తీసిన చట్నీ పాప్‌కార్న్ సినిమా భారతీయుల్లో ఇద్దరు ఆడవాళ్ళు పెళ్ళి చేసుకోవటం అనే విషయం మీద. అందుకని మనవాళ్ళల్లో చాలమందికి నచ్చినట్టు లేదు. క్లిష్టమైన విషయాన్ని చక్కగా చూపించిన సినిమా. అలాగే దీపామెహతా తీసిన ఫైర్. షబనా ఆజ్మీ నందిత దాస్‌ల మధ్య సంబంధం. ఆవిడే అంతకుముందు తీసిన ఎర్త్ సినిమా ఇండియా పాకిస్థాన్ విభజన సమయంలో ప్రేమకథ. ఈ రెండూ ధైర్యంగా తీసిన సినిమాలే. ఆవిడే వాటర్ అనే సినిమా ఇండియాలో తీస్తున్నదని వార్త.

నాకు బాగా నచ్చిన ఒక పాత హాలీవుడ్ సినిమా ఇంకొకటి వుంది. అది పాట్రిక్ స్వేజీ, ఓం పూరి నటించిన 'సిటీ ఆఫ్ జాయ్'. కలకత్తాలో దాదాగిరీ మీద తీసిన చక్కటి సినిమా. దాంట్లో స్వేజీ, పూరీ ఇద్దరూ చాల గొప్పగా నటించారు. ఈమధ్య ఇంకొక మంచి సినిమా వచ్చింది. బెండిట్ లైక్ బెక్కం అని. ఆ సినిమా డబ్బులు సంపాదించటమే కాక, పర్వీందర్ అనే బ్రిటిష్ అమ్మాయిని పెద్ద తారను చేసేసింది.

మొత్తానికి మనవాళ్ళు హాలీవుడ్‌లో నిర్మాతలుగా దర్శకులుగా తారలుగా వెలుగుతున్నారు. శుభం.

0 0 0